## పాఠము-4

# బహుదైవారాధన గురించి భయపడవలసిన ఆవశ్యకత

అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఈ విధంగా ప్రబోధించెను:

إِنَّ اللَّهَ لَا يَغْفِرُ أَنْ يُشْرَكَ بِهِ وَيَغْفِرُ مَا دُونَ ذَٰلِكَ لِمَنْ يَشَاءُ ۚ وَمَنْ يُشْرِكْ بِاللَّهِ فَقَدِ افْتَرَىٰ إِثْمًا عَظِيمًا ﴿٤٨﴾

**"తనకు భాగస్వామిగా మరొకరిని కల్పించటాన్ని(షిర్కును) అల్లాహ్ సుతరామూ క్షమించడు. ఇది తప్ప ఆయన తాను కోరినవారి పాపాలను క్షమించగలడు. అల్లాహ్‌కు భాగస్వామ్య కల్పన చేసినవాడు ఘోరమైన అబద్ధమును కల్పించాడు"**

***(4 : 48)***

ప్రవక్త ఇబ్రాహీం అలైహిస్సలాం ఈ విధంగా ప్రార్థించెను.

وَاجْنُبْنِي وَبَنِيَّ أَنْ نَعْبُدَ الْأَصْنَامَ ﴿٣٥﴾

**"(ఓ ప్రభువా) నన్ను మరియు నా సంతతిని విగ్రహారాధన నుండి రక్షించుము."**

***(14 : 35)***

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఈ విధంగా ఉపదేశించెను:

"మీరు చిన్నషిర్క్‌కు పాల్పడగలరని నాకు చాలా భయముగా ఉన్నది." చిన్న షిర్క్‌కు పాల్పడటం అంటే ఏమిటని ప్రశ్నించగా ఆయన "ఎదుటివాడు చూసి మెచ్చుకొనేందుకు చేయు పుణ్యకార్యములు"అని పలికెను.

*(ముస్నదె అహ్మద్-5:428-429)*

హజరత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ రజి అల్లాహు అన్హు ఈ విధముగా ఉల్లేఖించెను. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఈ విధముగా ప్రబోధించెను.

"ఏ వ్యక్తి అయితే ఆరాధనలో అల్లాహ్‌కు భాగస్వాములను కల్పిస్తూ మరణిస్తాడో అతడు నరకవాసి." *(బుఖారీ)*

హజరత్ జాబిర్ రజి అల్లాహు అన్హు ఈ విధముగా ఉల్లేఖించెను. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఈ విధముగా ఉపదేశించెను:

“ఏ వ్యక్తి అయితే ఆరాధనలో అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించ కుండా మరణిస్తాడో అతడు స్వర్గమున ప్రవేశించును. ఏ వ్యక్తి అయితే అల్లాహ్‌కు ఆరాధనలో భాగస్వాములను కల్పిస్తూ మరణిస్తాడో అతడు నరకవాసి.”

(ముస్లిం)

## దీనిలో 11 అర్థ తాత్పర్యములు కలవు.

1. అల్లాహ్‌కు సాటిగానీ, భాగస్వాములనుగానీ సృష్టించుటకు భయపడ వలెను.

2. ఎదుటి వారు చూసేందుకు పుణ్యకార్యములు చేస్తే అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించినట్లే.

3. ప్రదర్శనా బుద్ధితో మంచి పనులు చేసినట్లయితే స్వల్ప షిర్క్‌కు పాల్పడినట్లే.

4. పుణ్యాత్ముల విషయంలో అన్నింటికంటే ఎక్కువగా ప్రదర్శనాబుద్ధి లాంటి చిన్న తరగతి షిర్క్‌కు సంబంధించి భయపడవలసి ఉంటుంది.

5. స్వర్గము మరియు నరకము మానవునికి సమీపములో ఉన్నవి.

6. ఒకే హదీసులో స్వర్గ నరకముల గురించి విశదీకరింపబడెను.

7. ప్రపంచంలో మనుగడ సాగించినంత కాలం ఆరాధనలో అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించనివాడు స్వర్గమున ప్రవేశింపబడును. ఎవరైతే అల్లాహ్‌కు భాగస్వాములను కల్పిస్తాడో అతడు నరకమున ప్రవేశించును. అతడు ఎంతటివాడైనా సరే.

8. హజరత్ ఇబ్రాహీం అలైహిస్సలాం తనను, తన సంతానాన్ని విగ్రహారాధన నుండి కాపాడమని అల్లాహ్‌ని వేడుకొనుటలో ఒక పెద్ద ఉపదేశము కలదు.

9. “ఓ అల్లాహ్! ఈ విగ్రహాల వలన చాలా మంది మార్గభ్రష్టులైనారు” అని హజరత్ ఇబ్రాహీం అలైహిస్సలాం పలికెను. (ఖుర్ఆన్-14:36)

   అందువల్ల తనను, తన సంతతిని విగ్రహారాధన నుండి రక్షించమని అల్లాహ్‌ని వేడుకొనెను.

10. పైన తెలిపిన ఖుర్ఆన్ వాక్యాలు మరియు ప్రవక్త హదీసుల ద్వారా ‘లా ఇలాహ ఇల్లల్లాహ్’కి అర్థం క్షుణ్ణంగా తెలుపబడెను.

11. “షిర్క్” నుండి రక్షించబడిన వాని ఘనత.